# గురిచూసి దెబ్బ

'ఏమండీ!'

' ఆ ఏమిటి?'

' బైటి కెళ్తున్నారా అండీ!'

' ఏం ఎందుకూ?'

' మీరు బైటికెళ్తే....'

' ఏంపనీ? ఏం చెయ్యాలేమిటి?'

' అది కాదండీ?'

'బైటికెళ్తుంటే - కాస్త ఇంట్లో సామాన్లు తెస్తారనీ...'

' ఏం సామాన్లు?'

' పప్పుల్లాంటివి-'

' బైటికెళ్తుంటేనే తేవాలా?'

'అలా అని కాదండీ'!

'అంటే బైటికెళ్తే నీ సామాన్ల కోసం త్వరగా రమ్మనా?'

'మీ పనయిపోయి వచ్చేస్తోంటే తెస్తారనండీ'

'అహా! అలాగా? ఎక్కడికెళ్తున్నానో, ఎంతసేపటి కొస్తానో - అన్నీ ఓ రకంగా అరాలు తీయటమే కదా? మీ ప్రశ్నలన్నీ! ఎంత సేపటికి రాగలనో నాకే తెలీదు. అయినా అన్నీ నీతో చెప్పాలా?' ఇదీ - హరి కౌశల్యతో మాట్లాడే తీరు.

ఆరేళ్ళయింది కౌశల్య ఈ సంసారంలో అడుగుపెట్టి. ఆ రోజు నుంచీ ఈ నాటి వరకు హరి భార్యతో మాట్లాడే పద్ధతి యిదే రకం. భార్య అడిగిన ప్రతి మాటకీ తిరిగి ప్రశ్న వేసేవాడే కానీ సమాధానం ఎప్పుడూ చెప్పలేదు. ఏ అవసరమైన పని చెప్పినా 'చేస్తానూ, చెయ్యనూ' అని సూటిగా జవాబివ్వకుండా ఎదురు ప్రశ్నల వర్షంతో వేధించి విసిగించేవాడు.

"భార్యా భర్తలన్నాక ఏమీ అడక్కుండా, ఏమీ చెప్పకుండా సంసారం నడపడం ఎలాగ? భార్యా భర్తల మధ్య వుండవలసిన ఆప్యాయత, అనురాగం

లేకపోతే పోయె. కనీసం భర్తగా భార్య చెప్పే అవసరమైన విషయాలు కూడా ఏవీ వినకపోతే ఎలాగ?" అనుకునేది.

ఇంట్లోంచి బైటికెళ్తూ ఎక్కడికి వెళ్తున్నదీ, ఎంత సేపటికి వచ్చేదీ కూడా చెప్పేవాడు కాదు. అలా చెప్పకుండా వెళ్ళినప్పుడు హరితో పనుండి వచ్చిన వ్యక్తులు 'మీ వారేరండీ? ఎక్కడికెళ్ళారు? ఎంతసేపట్లో వస్తారు?' అని అడిగినప్పుడు ఏం చెప్పాలో తెలీక, 'మావారు నాకు చెప్పరండీ' అని భర్త పరువు పరాయి వాళ్ళ దగ్గర తియ్యలేక, ఏం చెయ్యాలో తెలీని అయోమయంలో పడి, వెర్రి దానిలా వాళ్ళను చూస్తూ, ఏదో చెప్పాలి కదా అని 'రావడానికి ఓ గంట పట్టొచ్చండీ'! అని అనగానే 'ఇంట్లో వుంటాను రమ్మని అన్నారండీ!' అని అవతలి వ్యక్తి ఆశ్చర్యపోతుంటే తన అబద్ధం బైటపడేది. వెంటనే సర్దుకుని' అయితే కూర్చోండి వచ్చేస్తారేమో! నేను సరిగ్గా విని వుండను' అని అబద్ధానికి మరో అబద్ధం జోడించేది. కొన్ని సార్లు కౌశల్య 'ఓ గంట దాకా రారేమో' అనగానే ఆ వచ్చిన వ్యక్తి 'వస్తానండీ'! అని బయలుదేరుతుండగానో, గేటు దగ్గరో ఎదురుపడి 'మీ శ్రీమతి మీరు రావడానికి ఓ గంట పడుతుందన్నారండీ'! అనగానే ఇంక ఇంట్లో కొచ్చి 'నీతో నేను గంటదాకా రానని చెప్పానా? నేను చెప్పనివి మా స్నేహితుల దగ్గర చెప్పి, అబద్దాల కోరునీ, వెధవనీ చేద్దామనా?' అని ఎగురుతుంటే ఆ యిల్లాలికి ఏం చెప్పాలో తోచేది కాదు.

"పోనీ మీరు ఎక్కడికెళ్ళారో, ఎంతసేపట్లో వస్తారో చెప్పడంగానీ, 'నా స్నేహితుడొస్తాడు కూర్చోమను. నేనొచ్చేస్తా'నని చెప్పడంగానీ చెయ్యొచ్చు కదా? వాళ్ళొచ్చి 'మీరెక్కడికెళ్ళా'రని అడుగుతుంటే 'నాకు తెలీ'దని చెప్తే మీ గురించి వాళ్ళేమనుకుంటారు? 'నా భర్త నాకేం చెప్పరండీ!' అని మీ పరువు తియ్యలేక అలా చెప్పానండీ! పోనీ అన్ని విషయాలు నాతో చెప్పకపోయినా యిలాంటి అవసరమైన విషయాలు చెప్పొచ్చు కదా" అని కౌశల్య మొదట్లో అడిగితే అంత మాట భార్య నోట వినడం తల కొట్టేసినంత అవమానంగా ఫీలయిపోయి 'నోరు మూసుకో - మగాడన్నాకా వంద పన్లుంటాయి. ప్రతీది నీతో చెప్పుకోవాలా? ఈ అడాళ్ళకి ఆరాలు తియ్యడం బాగా వచ్చు' అంటూ ఎగిరి మళ్ళీ నోరెత్తకుండా చేసాడు. ఆమె ఏదన్నా చెప్పబోతే ఏదో దురుద్దేశంతో మాట్లాడుతోందని ముందే మనసులో ఊహించుకుని ఆమె చెప్పే దానిని అపార్థం చేసుకుని వాదనకో, కయ్యానికో దిగేవాడే తప్ప కౌశల్య చెప్పిన దాంట్లో నిజాన్ని తెలుసుకునే ప్రయత్నం చేసేవాడు కాదు.

ఒక్కోసారి బైటికెళ్ళి అయిదు నిమిషాల్లో వస్తే ఒక్కోసారి గంట,

ఒక్కోసారి ఓపూట, ఓ రోజు దాటేదాకా వచ్చేవాడు కాదు. ఆఫీసు క్యాంపులకెళ్ళినా ఎన్నాళ్ళకి తిరిగి వస్తాడో చెప్పకపోయేసరికి ఇంట్లో కౌశల్య పరిస్థితి చాలా అయోమయంగా వుండేది. బైటికెళ్ళి ఏదన్నా కొని తెచ్చుకోవాలంటే ఏ టైములో భర్త ఇంటికొచ్చి బైట నిలబడతాడో తెలీదు. అతను వచ్చే టైముకి ఇల్లు తాళం వేసివుంటే ప్రారంభించేవాడు తిట్ల దండకం.

పెళ్ళయి యిన్నేళ్ళయినా అతని జీతమెంతో కౌశల్యకి తెలీదు. తెచ్చిన జీతం పర్సులో పెట్టుకుని ఇంటి అవసరాలకి అడిగితే ఒకటికి వందసార్లు ప్రశ్నించి అడిగిన దాంట్లో కొంతే యిచ్చేవాడు.

పెళ్ళిళ్ళకి, పేరంటాలకి వెళ్ళినప్పుడు, ఇంటికి బంధువులొచ్చినప్పుడు కూడా వారికి పెట్టుపోతలప్పుడు డబ్బులిచ్చే వారికి డబ్బులు కవర్లో పెట్టి యివ్వడం, బట్టలు పెట్టేవారికి తనే వెళ్ళి కొని తెచ్చి యివ్వడం కౌశల్య మనసుని బాధించేది.

ఇంటికి యజమానురాలిగా వచ్చిన తనకి ఈ ఇంట్లో ఏ మాత్రం ఆ గౌరవం లభించేది కాదు. ఒక్కళ్ళు వున్నప్పుడు ఆమెకేమాత్రం గౌరవం యివ్వకపోయినా పరవాలేదు. నలుగుర్లో వున్నప్పుడు కొన్ని పన్లు ఇంటి యజమానురాలి చేతుల మీద జరిగితే బాగుండేవి కూడా అతనే కలుగజేసుకుని ఆమె ఎదురుగానే చెయ్యడం చాలా చిన్నతనమనిపించేది. కొందరు 'కౌశల్య పెట్ట నివవ్వదనుకుంటే, కొందరు కౌశల్య పెట్టనంటుంది లాగుంది అందుకే హరి పెడుతున్నాడు పాపం' అంటుంటే విని ఆ మాటనే భర్త దగ్గర అంది. 'ఏం ఎవరికేం పెట్టాలో నీకు తెలుసా? అసలు ఎవరికెంత పెట్టేస్తున్నానో అన్న ఏడుపుతో ఇలా ఎవరో ఏవో అంటున్నారని పుట్టగించి నీ కడుపులో వున్న కుళ్ళుని కక్కుకుంటున్నావు. అసలు ఏడుపు నీకు పెట్టడం యిష్టంలేక' అనేవాడు.

ఇలా భార్యకి ఏ విషయాలు చెప్పని హరి భార్య తనకి అన్నీ చెప్పాలని, ఏ విషయం దాచకూడదనీ, దాస్తోందేమో అన్న అనుమానం పీడించి ప్రతీ విషయం ఒకటికి పదిసార్లు గుచ్చి గుచ్చి అడిగేవాడు.

ఇంట్లో తల్లి, అక్కచెల్లెళ్ళు, భార్య అనే వ్యక్తి ఎంత దుర్మార్గురాలిగా వుంటుందో, భర్తని ఎలా ఆడించి ఏడిపిస్తుందో హరికి పెళ్ళికి ముందు నుంచీ నూరిపోసిన ప్రభావం, చేసిన బోధల వల్ల 'భార్య అంటే శత్రువు' అన్న ఒక అభిప్రాయం ముందే హరి మనసులో ఏర్పడి పోయి, ఆ దృష్టితోటే పెళ్ళి అయిన

క్షణం నుంచీ భార్యని చూడసాగాడు. ఆమె ఎడ్డెం అంటే తను వెంటనే తెడ్డెం అనేవాడు. ఆమె ఏ పని చెప్పినా 'చెయ్యకూడదు' ఆమె చెప్పింది 'వినకూడదు' - ఏం అడిగినా కూడా 'చెప్పకూడ'దని నిశ్చయించుకుని, అలాగే నడుచుకునేవాడు.

"నిన్నగాక మొన్నొచ్చిన దీనికి నా అప్పు ఆస్థి చెప్పుకోవాలా? నా డబ్బూ నా యిష్టం యిదెవ్వత్తని దీనికి చెప్పాలి? అప్పనంగా దీనికి తిండి పెడుతున్నందుకు నా యింట్లో నోరు మూసుకుని పడుండి నే చెప్పినట్లు వినాలి గానీ అది నాకు చెప్పడమా?" అన్న అహంభావంతో కౌశల్య దగ్గర ప్రవర్తించేవాడు.

పెళ్ళయిన కొత్తలో కౌశల్యకి భర్త ప్రవర్తన అర్థమయ్యేదికాదు. ప్రశ్నకి ప్రశ్నలేస్తూ, జవాబివ్వకుండా వెటకారంగా తూలనాడుతూ మాట్లాడే హరిని చూస్తుంటే వింతగానూ, రాను రాను చిరాగ్గానూ వుండేది. వీలయినంత వరకు అతనితో మాట్లాడకుండా వుండటం ఉత్తమమనిపించేది. కానీ సంసారం సాగాలంటే అది ఎంత వరకు సాధ్యం? తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని మొండిగా వాదించే వ్యక్తితో కాపురం చెయ్యడం కత్తిమీద సాములాగే వుండేది.

ఇంట్లో ఎప్పుడూ చిటపటలాడుతూ, భార్యని గజగజలాడించే ఈ వ్యక్తే బంధు మిత్రుల మధ్యకెళ్తే వుండే తీరే వేరుగా వుండేది. హాస్యోక్తులతో నవ్వుతూ, నవ్విస్తూ, మాట్లాడే హరిని చూసి అంతే 'అబ్బా ఎంత సరదా అయిన మనిషి' అనుకోవడమే కాకుండా కౌశల్యకి అంత మంచి భర్త లభించినందుకు తెగ పొగిడేవారు.

ఆఫీసు నుంచి రెండు గంటలకే వచ్చిన హరి సూట్‌కేస్ తీసి బట్టలు సర్దుతుంటే అనుకుంది కౌశల్య 'ఈయన క్యాంప్‌కి వెళ్తున్నారులాగుంది' అని. కానీ అడగలేదు.

పెట్టె తీసుకుని 'తలుపేసుకో' అంటూ బైటికెళ్ళిపోతున్న హరిని చిరాగ్గా చూస్తూ 'అబ్బా కనీసం రెండు రోజులన్నా రాకుండా వుంటే బాగుండును హాయిగా వుందును' అనుకుంటూ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటూ తలుపేసుకుంది కౌశల్య.

మోగుతున్న బెల్ శబ్దానికి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి వెళ్ళి తలుపు తీసింది కౌశల్య. వీధి గుమ్మంలో టెలిగ్రామ్ వాడు. వణుకుతున్న చేతుల్తో

సంతకం చేసి కవరు చింపింది.

ఆ టెలిగ్రామ్ హరికి. అందులోని అక్షరాలు ఒకటికి పదిసార్లు చదివింది. 'మదర్ సీరియస్ స్టార్ట్ యిమిడియట్లీ' అని వుంది. అడుగున మరిది పేరుంది. టైము చూసింది. రాత్రి పదకొండు దాటింది. ఏం చేయాలో తెలీటం లేదు. నిన్న భర్త ఎక్కడికెళ్తున్నాడో, ఎన్నాళ్ళకని వెళ్తున్నాడో, ఎప్పుడొస్తాడో చెప్పలేదు. ఈ విషయం అతనికి ఎలా తెలియచెయ్యడమో అర్థం కావటం లేదు. ఈ రాత్రప్పుడు ఎవర్ని లేపాలి? ఎవర్నడిగితే భర్త గురించి తెలుస్తుంది అని ఆలోచిస్తూ రాత్రల్లా గడిపింది.

ఉదయం ఆఫీసుకి ఫోన్ చేసి 'హరి గారు ఏ వూరు క్యాంపు కెళ్ళారండీ' అని తోటి ఉద్యోగస్తుడిని అడగ్గానే 'క్యాంప్ కేమిటండీ? స్నేహితుడి కూతురి పెళ్ళికని నాలుగు రోజులు శలవు పెట్టారు. మీకు చెప్పలేదా? ఆశ్చర్యంగా వుందే'! అంటూ హరికి లాగే ప్రశ్నిస్తుంటే సిగ్గుతో 'ఏదో చెప్పారు మర్చిపోయా' నంటూ ఫోను పెట్టేసింది. ఈ విషయం విన్న కౌశల్య ఏదో నిర్ణయానికొచ్చిన దానిలా ఇంటి కొచ్చి టెలిగ్రాము పక్కన పెట్టింది.

నాలుగు రోజుల తరువాత యింటికొచ్చిన భర్తకి మౌనంగా టెలిగ్రామందించింది కౌశల్య. విషయం చదివి 'మా అమ్మ సీరియస్ అన్న టెలిగ్రామందుకుని హాయిగా యింట్లో కూర్చుని ఆనందిస్తున్నావా?' అంటూ త్రాచుపాములా లేచిన భర్తని సహనం చచ్చిన కౌశల్య తీక్షణంగా చూస్తూ 'టెలిగ్రామందుకుని ఇంట్లో కూర్చోకపోతే ఏ వీధికెళ్ళి మిమ్మల్ని వెతకమంటారు? ఎక్కడికి పంపించమంటారు?' అని ఎదురు ప్రశ్న వేసింది.

ఆ మాటలకి కౌశల్య మీద పిచ్చి కోపమొచ్చినా తల్లి కెలాగుందో అన్న కంగారుతో ఆదరా బాదరాగా బైటికెళ్ళి యిచ్చిన రిప్లై పెయిడ్ టెలిగ్రాముకి "మూడు రోజుల క్రితం అమ్మపోయిం"దన్న జవాబు రాగానే 'నీ వల్లే నా తల్లిని చూసుకోలేక పోయా' నంటూ పిచ్చి కోపంతో ఎగరసాగాడు.

'చూడండీ! పెళ్ళయిన దగ్గర నుంచీ మిమ్మల్ని చూస్తున్నాను. మీ ప్రవర్తన రోజు రోజుకీ విసిగిస్తోందేగాని ఏ విధాన మనసుకి శాంతి నివ్వడం లేదు. భార్య దగ్గర అన్నీ గుట్టుగా దాచే మీ లాంటి వారికి ఇలాంటి సంఘటనే మనసుకి సూటిగా తగిలి కన్ను తెరిపిస్తుంది. భార్యంటే శత్రువు కాదు. 'నా' అన్న వారి నందర్నీ విడిచి మీతో వచ్చి మీ కష్ట సుఖాల్ని పంచుకుంటుంది. తను తిన్నా, తినక పోయినా భర్తని ఆనందంగా వుంచాలనుకుంటుంది. అన్నింటి కన్నా

ముఖ్యమైన విషయం మీ జీవితంలో ప్రవేశించిన నాటి లగాయతు చివరి వరకు మీతోటే వుండి, మీ తప్పొప్పుల్ని మన్నించి ఆదుకునేది భార్య ఒక్కర్తేనండీ, పెళ్ళి చేసి తల్లితండ్రులు పిల్లల బాధ్యతలు తీరాయనుకుంటారు. కన్న పిల్లలు రెక్కలొచ్చాక ఎవరికి వారు వెళ్ళిపోయి కాస్త దూరమవుతారు. చచ్చేదాకా కలిసి వుండేది భార్యతో భర్త, భర్తతో భార్యే! ఈ నిజం తెలుసుకోకుండా ఈ ఇంట్లో నన్ను ఓ దోమకన్నా హీనంగా చూస్తున్నారు. ఇలాంటి దెబ్బ తగిలి, మీలో చలనం కలిగితే మీ తప్పుల్ని మీరు తెలుసు కుంటారు. ఈ రోజు ఈ సంఘటనే మిమ్మల్ని మార్చి నా బాధేమిటో తెలియజెయ్యాలని కోరుకుంటున్నాను. మీరెక్కడి కెళ్ళారో మీ తోటి ఉద్యోగస్తుడికి చెప్పినట్లే నాకూ చెప్పి అడ్రస్ యిచ్చివుంటే ఈ టెలిగ్రాము మీకు పంపేదాన్ని. కనీసం మీ తల్లి శవాన్నయినా చూసుకుని వుండేవారు. మీరు నాకు చెప్పడం నామోషీగా ఫీలవడం వల్ల జరిగిన అనర్థం ఎవరికి? మీకే! కన్న తల్లిని కడసారిగానయినా చూసుకోలేకపోవడం నా తప్పు కాదు. మీలో వున్న దురహంకారమే! ఇక ఈ విషయంలో మీ వాళ్ళు మిమ్మల్నేమనుకుంటారో తెలుసుకోండి. ఇక ముందయినా మీరు మీ తత్వాన్ని మార్చుకుని ప్రవర్తించండి. అన్ని విషయాలు కాకపోయినా అవసరమైన విషయాలు చెప్పడం మీకే మంచిది" అంటూ సూటిగా చెప్పి, చర్రున లేచి లోపలికెళ్ళిపోయిన కౌశల్యని చూస్తూ తలదించుకున్నాడు హరి.

*

**( మే - జూన్ 2002, భూమిక)**